క్లుప్తంగా

పాదయాత్రగా వెళ్లి మొక్కులు



పాదయాత్రగా బయలుదేరిన మహిళలు

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన మహిళలు కాలినడకన వెళ్లి బాసరలోని సరస్వతీ అమ్మవారికి పూజలు చేశారు. సోమవారం లోకేశ్వరం శివాలయంలో ప్రత్యేక పూజల అనంతరం 35కిలోమీటర్ల దూరంలోని బాసరకు పాదయాత్రగా వెళ్లి ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు.

నేడు స్టడీ మెటీరియల్ పంపిణీ

భైంసాటౌన్: భైంసాలో ముధోల్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు చైర్మన్ భోజారెడ్డి తెలిపారు. మంగళవారం భైంసాలోని బజాజ్ ఇండస్ట్రీలో ఉదయం నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తామని.. విద్యార్థులు పాఠశాల గుర్తింపుకార్డులతో రావాలని సూచించారు. అలాగే వార్షిక పరీక్షల్లో నియోజకవర్గంలో మొదటిర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.20వేలు, రెండో స్థానంలో నిలిచినవారికి రూ.పదివేల నగదు బహుమతి అందిస్తామని తెలిపారు.

కేంద్రబృందం పర్యటన



పనులు పరిశీలిస్తున్న అధికారులు

కుభీర్: మండలంలోని పల్సి, పార్డి(కె), దొడర్నా, సిర్పెల్లి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను సోమవారం కేంద్రబృందం సభ్యుడు గంగప్ప, ఇన్‌చార్జి ఎంపీడీవో కవిరాజు, ఏపీవో హరిలాల్ పరిశీలించారు. ఆయా గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్, పింఛన్లు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

అందుబాటులో యూరియా, టార్పాలిన్లు

ముధోల్: స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు యూరియా డీఏపీ, టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ పేర్కొన్నారు. అవసరమైన రైతులు ఆధార్ తీసుకొని కార్యాలయానికి రావాలన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



బహుమతి అందిస్తున్న రామారావ్ పటేల్

లోకేశ్వరం: యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ముధోల్ అసెంబ్లీ బీజేపీ నాయకుడు రామారావు పటేల్ అన్నారు. మండలంలోని అబ్దుల్లాపూర్‌లో ప్రారంభించిన క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్‌లో ముధోల్,అబ్దుల్లాపూర్ జట్లు తలపడ్డాయి. ప్రథమ స్థానంలో నిలిచిన ముధోల్ జట్టుకు రూ.33,333, ద్వితీయ స్థానంలో నిలిచిన అబ్దుల్లాపూర్ జట్టుకు రూ.15,555 నగదు అందజేశారు. సర్పంచ్ రమణారెడ్డి, రాజారెడ్డి, దిగంబర్, మహేందర్‌రెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

పరీక్షలంటే భయపడొద్దు

ముధోల్: విద్యార్థులు భయపడకుండా పట్టుదలతో చదివి పరీక్షలు రాయాలని పరీక్షా పే చర్చ కార్యక్రమ జిల్లా కోర్డినేటర్ తాలోడ్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో సోమవారం పరీక్షాపే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయం వృథా చేయకుండా ప్రణాళికతో చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ సాయినాథ్, బీజేవైఎం ముధోల్ తాలుకా కన్వీనర్ ఎం.అనిల్, బీజేపీ ముధోల్ మండలాధ్యక్షుడు పోతన్న, విష్ణు, శ్రీనివాస్, రాజేందర్ ఉన్నారు.

అనాథ వృద్ధులకు చేయూత



పింఛన్ అందిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో 10మంది అనాథ వృద్ధులకు దాతల సాయంతో ఒక్కొక్కరికీ నెలకు రూ.200 ఏడాది పాటు అందిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు. సోమవారం స్థానిక ఆలయంలో వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి సూచన మేరకు క్లబ్ జోన్ చైర్మన్ జితేందర్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో విశ్వనాథం, ముక్క కిషన్, సామ లక్ష్మినారాయణ, చిటికేశి సతీశ్, సుదర్శన్ పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం..సాయి

- నేడు సాయిబాబా ఆలయంలో జాతర, మహాఅన్నదానం
- హాజరుకానున్న మంత్రులు ఐకేరెడ్డి, సత్యవతి రాథోడ్



ఖానాపూర్‌లో విద్యుత్‌దీపాలతో అలంకరించిన బాబా ఆలయం

ఖానాపూర్: ఉత్తరవాహినీ గౌతమి గోదావరి తీరంలో ఖానాపూర్ సాయిబాబా ఆలయం అభినవ షిర్డీగా పేరు గాంచింది. ఏదైనా కోరికతో బాబాను దర్శించుకుంటే తీరుతుందని ఇక్కడి ప్రాంతంలోని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయ 26వ వార్షికోత్సవం నేపథ్యంలో ఈనెల 17నుంచి ఖానా పూర్ పట్టణం నిత్యం సాయినామస్మరణతో మారుమోగుతోంది. వారం రోజులుగా నియమ, నిష్ఠలతో నిర్వహించే శ్రీ సాయిసచ్చరిత్ర, గురుచరిత్ర పారాయణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఆరు క్వింటాళ్ల బియ్యంతో చేపట్టిన అన్నదానం.. నేడు 60 క్వింటాళ్లపైచిలుకు బియ్యంతో మహా అన్నదానం నిర్వహించే పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది. సాయిదీక్షాపరుల సంఖ్య సైతం రోజురోజుకు గణనీయంగా పెరుగుతోంది. ఇప్పటికే సాయిపల్లకీ, శోభాయాత్ర, కుంకుమార్చన, వివిధ యాగాలు, ప్రత్యేక పూజలు చేశారు.

నేడు జాతర, అన్నదానం..

ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 24న జరిగే జాతరలో నిత్యహవనం, దిక్‌బలి, జయాది హవనం, హోమ సంపూర్ణార్థం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. స్వామిజీలు యోగానంద సరస్వతీ, మంగిరాములు మహారాజ్, దేవ విద్యాభారతి కరకమలాలచే బాబాకు కుంభాభిషేకం, లోకకల్యాణార్థం శ్రీశివపార్వతుల శ్రీలక్ష్మీనారాయణుల కల్యాణమహోత్సవం జరిపిస్తారు. అనంతరం మహా అన్నదానం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతారు.

హాజరవనున్న ప్రముఖులు..

చివరిరోజైన మంగళవారం నిర్వహించే జాతర మహోత్సవానికి స్వామిజీలు హాజరై మహాకుంభాభిషేకం, తదితర పూజల్లో పాల్గొంటారు. రాష్ట్ర మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్ అధికారిక పర్యటన సైతం ఖరారైంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు తదితర ప్రముఖులు సైతం హాజరుకానున్నారు. జాతర సందర్భంగా ఆర్కెస్ట్రా, స్థానిక కళాసమాఖ్య ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక భజనలు ఏర్పాటు చేశారు. గతంలో కరోనా కారణంగా భక్తులు తగ్గినప్పటికీ ఈసారి అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది.



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుకాణాలు

అభివృద్ధి చెందుతున్న ఆలయం..

పట్టణ శివారులో ఉన్న జంగల్ హనుమాన్ సాయిబాబా ఆలయం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. ముందుగా ఇక్కడ వీరాంజనేయ, శివాలయాలు మాత్రమే ఉండేవి. చుట్టూ అటవీప్రాంతం ఉన్నప్పటికీ పక్కనే మరో రెండెకరాలు సేకరించారు. ఇత్తడి, వెండి సింహాసనాలతోపాటు ధర్మశాల, ప్రవేశ తోరణం, ప్రాంగణంలో సీసీ ప్లాట్‌ఫాం, చుట్టూ ప్రహరీ నిర్మించారు. మహిళలు పారాయణం చేసేందుకు శాశ్వత మండపం ఏర్పాటు చేశారు. ఏడాది కిందట ఆలయ ఆవరణలో విగ్రహం ఏర్పాటు చేసి నూతన కల్యాణ మండపం సైతం నిర్మించారు.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం. ఇప్పటికే ఆలయ ఆవరణలో పలువురు వ్యాపారులు సైతం దుకాణాలు ఏర్పాటు చేశారు.

– అంకం రాజేందర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు



అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే రేఖానాయక్ సోమవారం అభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సాయిబాబా జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అంతకుముందు పట్టణంలోని వాసవిమాత ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో అంకం రాజేందర్, కొక్కుల ప్రదీప్, మహాజన్ జితేందర్, వెంకటప్పయ్య, ద్యావతి రాజేశ్వర్, అశోక్‌రావు, రాచమల్ల రాజశేఖర్, అర్చకులు శశిధర్‌శర్మ, మల్లేశ్, అభిషేక్‌శర్మ, ఆనంద్, అన్వేశ్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

ఖానాపూర్ మండలంలోని గోడలపంపు గ్రామంలో పలువురు ఎమ్మెల్యే రేఖానాయక్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఉపసర్పంచ్ అజయ్‌తోపాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శంకర్, శ్రీనివాస్, శోభన్, రాజేశ్వర్, మురళి, ధర్మరాజు, వెంకటేశ్ ఉన్నారు.

27న విదేశీ విద్య కోసం స్క్రీనింగ్ టెస్ట్

నిర్మల్‌చైన్‌గేట్: జపాన్ ప్రభుత్వ పథకం, స్పెసిఫైడ్ స్కిల్డ్ వర్కర్స్ కింద జపాన్‌లో పనిచేసేందుకు అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బందికి శిక్షణ, నియామకం చేపడుతున్నట్లు టోమ్ కోమ్ హెచ్‌ఆర్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 15న మొదటి విడత స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి 25 మంది నర్సింగ్ అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. తదుపరి బ్యాచ్ కోసం ఈనెల 27న ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్, రిమ్స్ ఆదిలాబాద్‌లో ఉదయం 10 గంటలకు స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత సమయంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపిక చేయబడిన అభ్యర్థులకు జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ, జపాన్‌లో పని చేయడానికి అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాల శిక్షణ ఇస్తామని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షలు వేతనం ఉంటుందని వివరించారు. పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నమోదు చేసుకునేందుకు 9951909863, 9100798204 నంబర్లకు లేదా మీ బయోడేటాని hrm& tomcom& letf@telangana. gov. in కు మెయిల్ గానీ చేయాలని సూచించారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



అమ్మవారి తాళిబొట్టు చూపుతున్న పూజారి

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని శ్రీరారాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివ పార్వతుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఎంపీపీ అడ్వాల పద్మ-రమేశ్ దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు స్వామివారికి సమర్పించారు. పూజారులు నిమ్మగడ్డ సందీప్‌శర్మ, కొండపర్తి ప్రహ్లాదశర్మ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జెడ్పీటీసీ రాజేశ్వర్, మంత్రి సోదరుడు అల్లోల సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు క్రిష్ణారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోదరుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సురేందర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డిలను శాలువాతో సన్మానించారు. నర్సాపూర్ ఎంపీటీసీ గణేశ్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

కరెంటు కోసం రోడ్డెక్కారు

భైంసాటౌన్: తమ ఊరికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలంటూ గుండెగాం వాసులు సోమవారం సాయంత్రం రోడ్డెక్కారు. ముంపు గ్రామమైన గుండెగాం నిర్వాసితులకు భైంసా శివారులోని పార్డి(బి) రోడ్డులో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లలో తాత్కాలిక ఆశ్రయం కల్పించారు. డబుల్‌బెడ్రూం సముదాయానికి సంబంధించిన విద్యుత్‌బిల్లు బకాయిలు పేరుకుపోవడంతో విద్యుత్ అధికారులు రెండు రోజులుగా సరఫరా నిలిపేశారు. దీంతో చీకట్లో ఎలా ఉండాలంటూ సోమవారం సాయంత్రం స్థానికులు ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై హన్మాండ్లు, ఎండీ.గౌసుద్దీన్ అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి సరఫరా పునరుద్ధరింపజేశారు. దీంతో ఆందోళన విరమించారు. కాగా, డబుల్‌బెడ్రూం ఇళ్ల ముదాయానికి సంబంధించి విద్యుత్ సరఫరా నిలిపివేతపై 'సాక్షి' ఏఈ మోహన్‌కుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరగా, రూ.2 లక్షల వరకు బకాయి ఉండడంతో సరఫరా నిలిపేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లామని, ఎవరూ పట్టించుకోకపోవడంతోనే సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపారు.

నేతాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలి



భైంసాలో నివాళులర్పిస్తున్న నాయకులు



మిర్జాపూర్‌లో ఉపాధ్యాయుల నివాళి

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లీలో సుభాశ్ చంద్రబోస్ విగ్రహానికి నేతాజీ యువజన సంఘం, బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాయినాథ్, బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్ మాశెట్టివార్, తోట రాము, వెటర్నరీ వైద్యులు విఠల్, తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: నేతాజీ సుభాశ్ చంద్రబోస్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు పేర్కొన్నారు. మండలంలోని మిర్జాపూర్, వానల్‌పాడ్, కుంసర, ఇలేగాం, కామోల్ తదితర గ్రామాల్లో నేతాజీ జయంతి నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామ పోరాటంలో వారు చేసిన పోరాటం మరువలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, కడారి దశరథ్, మల్లికార్జున్, సత్యనారాయణ, అరుణ, శ్రీనివాస్, యువజన సంఘాల సభ్యులు తదితరులు ఉన్నారు.

ముధోల్: మండలవ్యాప్తంగా నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముధోల్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానాచారి సారథిరాజు, అకాడవిక్ ఇన్‌చార్జులు స్వప్న, ఆచార్యులు పాల్గొన్నారు.

కుంటాల : స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో సోమవారం నేతాజీ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సంతోశ్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖి



తర్లపాడ్‌లో కళ్లద్దాలు అందిస్తున్న కలెక్టర్

ఖానాపూర్: కంటివెలుగు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖి అన్నారు. సోమవారం మండలంలోని తర్లపాడ్, మస్కాపూర్, మేడంపల్లి గ్రామాల్లో నిర్వహించిన కంటివెలుగు కేంద్రాలను వారు తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేంద్రాల నిర్వహణపై అధికారులు, సిబ్బందితోపాటు అక్కడికి వచ్చిన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాజునాయక్, మహేందర్, పెద్దిన ర్సయ్య, రామిడి మహేశ్ తదితరులు ఉన్నారు.

కడెం: మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని సోమవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

ఆకొండపేటలో పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

దస్తురాబాద్ మండలంలోని ఆకొండపేట గ్రామంలో కంటివెలుగు వైద్యశిబిరాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే రేఖానాయక్ సందర్శించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో పలువురికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సుధీర్‌బాబు, ఎంపీపీ సింగరి కిషన్, సర్పంచ్ పోషలింగం, తహసీల్దార్ లక్ష్మీ, ఎంపీడీవో వేంకటేశ్వర్లు, వైద్యులు కామేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో కొనసాగుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని సోమవారం జెడ్పీటీసీ రాజేశ్వర్ పరిశీలించారు. ఇప్పటివరకు 400 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. జిల్లా హార్టికల్చర్ అధికారి శ్యామ్‌రావు, ఎంపీడీవో మోహన్, ఎంపీవో నసీరుద్దీన్, వైద్యులు శ్రీకాంత్, లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి(కే)లో కంటివెలుగు శిబిరాన్ని వైస్ ఎంపీపీ లక్ష్మి ప్రారంభించారు. సర్పంచ్ రజనీ, ఉపసర్పంచ్ కల్యాణ్, ఎంపీడీఓ వనజ, కార్యదర్శి పద్మజ, సుధాకర్ పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని దౌలతాబాద్, బామ్నితండా గ్రామాల్లో మంగళవారం నుంచి కంటివెలుగు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అబ్దుల్ ఖాసీఫ్ ఓ ప్రకటనలో తెలిపారు.

కుంటాల : మండలంలోని అంబకంటి తాండాలో మంగళవారం నుంచి ఈనెల 27వరకు కంటివెలుగు కార్యక్రమం నిర్వహింస్తున్నట్లు ఎంపీడీవో దేవేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం ప్రధాన వీధుల గుండా ర్యాలీ తీసి కంటివెలుగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ శంకర్, కార్యదర్శి, సతీష్‌కుమార్, ఏఎన్‌ఎం మాధవి ఉన్నారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



నృత్యం చేస్తున్న మనస్విని

నిర్మల్: కన్యకాపరమేశ్వరి మాత ఆత్మార్పణ దినం పురస్కరించుకుని సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. జిల్లాకేంద్రం సమీపంలోని శాకెరరోడ్డులోని వాసవీక్షేత్రంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, పల్లకిసేవ, అమ్మవారి చరిత్ర పారాయణం, పూజాకార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా చిన్నారి బచ్చు మనస్విని చక్కని నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆమెడ కిషన్, కార్యవర్గ సభ్యులు పూజ, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు



సూచనలిస్తున్న ట్రాఫిక్ ఎస్సై దేవేందర్

నిర్మల్‌టౌన్: మైనర్ల చేతికి వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ అన్నారు. ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం నిర్మల్‌లో పట్టణ సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో 48 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సరైన ధ్రువపత్రాలు లేని ఐదు వాహనాలను ఆర్టీవోకు అప్పగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు అతివేగం, నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్నారు. వాహనాల నంబర్ ప్లేట్లు తప్పుగా రాసిన, విరగ్గొట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులకు సూచించారు. ఇందులో పలువురు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి ఈద్గా మ్యాప్ వివరించిన మతపెద్దలు



మంత్రికి వివరిస్తున్న అధికారులు, మతపెద్దలు

నిర్మల్‌టౌన్: నిర్మల్‌రూరల్ మండలం చించోలి శివారులో హైదరాబాద్ ఆర్కిటెక్చర్ రూపొందించిన నూతన మైనారిటీ ఈద్గా మ్యాప్‌ను మత పెద్దలు, మున్సిపల్ అధికారులు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి సోమవారం వివరించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మైనార్టీ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, ముస్లిం పెద్దలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'అనాథలను ప్రభుత్వమే ఆదుకోవాలి'

నిర్మల్‌టౌన్: అనాథ పిల్లలను ప్రభుత్వమే ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ నిర్మల్ జిల్లా కన్వీనర్ శనిగరపు కమలాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మార్పీఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ప్రతిపక్ష పార్టీల నాయకులతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కమలాకర్ మాట్లాడారు. సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ బర్ల రాజకుమార్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భానోత్ గోవింద్‌నాయక్, దివ్యాంగుల సంఘం జాతీయ నాయకులు సట్టి సాయన్న, బహుజన్ ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు సూర్యకాంత్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉపాధి నిధులు రికవరీ చేయాలి

నర్సాపూర్(జి): మండలంలోని గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా సీసీ రోడ్లు నిర్మించి ఉపాధి నిధులను దుర్వినియోగం చేశారని ఆర్టీఐ కార్యకర్తలు పేర్కొన్నారు. సదరు నిధులను రికవరీ చేయాలని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆర్టీఐ కార్యకర్తలు సయ్యద్ కలీమ్, జమీల్ షా, సతీశ్.. సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

ఆలయ పనులకు భూమిపూజ

లక్ష్మణచాంద: సోన్ మండలంలోని బొప్పారంలో సోమవారం రూ.12లక్షలతో చేపట్టే భీమన్న ఆలయ నిర్మాణ పనులకు జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి భూమిపూజ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ క్రిష్ణ ప్రసాద్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మొయినొద్దీన్, ఉపసర్పంచ్ నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలతో సమీక్ష

నర్సాపూర్(జి): ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్ బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక కేజీబీవీ ఇంటర్ విద్యార్థినులకు ఓటరు దినోత్సవం రోజున ముగ్గుల పోటీలు, వ్యాసరచన, ఓటరు ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించాలని సూచించారు. ఆర్ఐ వేణుగోపాల్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

26 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

కుంటాల : కుంటాలలో ఈనెల 26 నుంచి బ్యాడ్మింటన్(డబుల్స్) టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాజశేఖర్, జట్ల ముత్యం, వంశీ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 9951235265, 9666699472 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'చర్చి నిర్మాణ పనులు నిలిపివేయాలి'

కుంటాల: మండలంలోని అందకూర్‌లో చర్చి నిర్మాణ పనులు వివాదాస్పదంగా మారాయని కోరుతూ సోమవారం కుంటాల తహసీల్దార్ కలీం, ఎస్సై సాయికిరణ్‌కు హిందువాహిని కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. హిందువాహిని మండల కన్వీనర్ దిగంబర్‌పటేల్, సభ్యులు శ్రీనివాస్, గంగాధర్ ఉన్నారు.

సంతాపం

భైంసాటౌన్: నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన జంతుశాస్త్ర అధ్యాపకులు ఎం. చంద్రశేఖర్ మృతికి సంతాపంగా భైంసాలోని డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం శ్రద్ధాంజలి ఘటించారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.